క్లుప్తంగా

రాయితీలో స్ప్రింక్లర్లు

నగరి: సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాల్లోపు భూములున్న రైతులు 55 శాతం సబ్సిడీతో, 5 ఎకరాల కంటే ఎక్కువ భూములున్న రైతులు 45 శాతం సబ్సిడీతో వీటిని పొందవచ్చన్నారు. ఒక హెక్టారుకు 30 పైపులు, 5 స్ప్రింక్లర్లు, రెండు హెక్టార్లకు 41 పైపులు, 9 స్ప్రింక్లర్ల చొప్పున అందిస్తామన్నారు. 63 మిమీ నుంచి 110 మిమీ వరకు పైపు సైజులున్నాయని సైజులను బట్టి ధర ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు వ్యవసాయ కార్యాలయం వద్ద తమ పాసుపుస్తకాలతోపాటు సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో

నగరి: మండలంలోని తడుకుపేట దొమ్మరిండ్లు ఎస్టీ కాలనీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో శ్రీదేవి తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా పాఠశాలకు వెళ్లిన ఆమె విద్యార్థుల మధ్య కూర్చుని మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రతి రోజు ఇలాగే భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థుల విజ్ఞానాన్ని పలు ప్రశ్నల ద్వారా పరీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశానం దారి ఆక్రమణపై విచారణ



గ్రామస్తులను విచారిస్తున్న అధికారులు

నగరి: నెత్తంకండ్రిగ వద్ద శ్మశానానికి వెళ్లే దారిలో తుడా వారు గోడ కడుతున్నారని తమకు దారి లేదని స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం నెత్తం కండ్రిగకు వెళ్లిన తుడా భూసేకరణ అధికారి సుజన, రిటైర్డ్ కలెక్టర్లు డీవీఎస్ రెడ్డి, బాలయ్య, తహసీల్దార్ రవికుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి నీరజాక్షి శ్మశానంలో గోడ కడుతున్న స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, సర్వేయర్, నెత్తంకండ్రిగ వీఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం: ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి పనిచేసి మండల అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం.థామస్ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఎంపీపీ లత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరి సహకారం అవసరమన్నారు. అధికారులు విధి నిర్వహణలో సమయపాలన పాటించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో వివిధ సమస్యలను సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ సుందర్‌రాజ్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ధనంజయవర్మ, ఏడీఈ నాగరాజు, తహసీల్దార్ భగవతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మీపతి, మండల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు



లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం నగరంలోని మెసానికల్ మైదానంలో క్రీడాపోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల 8,9వ తరగతుల చదివే విద్యార్థులు ఈ పోటీలకు ఉత్సాహంగా హాజరయ్యారు. విద్యార్థులకు లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగు పందెం పోటీలను నిర్వహించినట్లు డీఎస్‌డీఓ బాలాజి తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ సంఘటన భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలి. వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పించాలి. వైద్యులపై దాడులకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి శిక్షించాలి. మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

– డాక్టర్ దుర్గాదేవి, మండల వైద్యాధికారిణి, గంగాధరనెల్లూరు



ఆత్మస్థైర్యాన్ని నింపాలి



ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే వైద్యులపై దాడులకు దిగిన, అఘాయిత్యాలకు పాల్పడిన నేరస్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చి వైద్యుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మండల వైద్యాధికారి, గంగాధరనెల్లూరు

సమాజంలో మార్పు అవసరం



మహిళల విషయంలో సమాజంలో మార్పు రావాలి. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల పట్ల ఇలాంటి క్రూరమైన ఆలోచనలు రావడం బాధాకరం. కోల్‌కోతా లాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వైద్యులు నిర్భయంగా విధులు నిర్వహించేలా భరోసా కల్పించాలి.

– డాక్టర్ రవిరాజు, రిటైర్డ్ వైద్యాధికారి, కార్వేటినగరం

మట్టి గణపయ్యలనే పూజిద్దాం

- పర్యావరణాన్ని కాపాడుదాం
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో ముప్పు

పాలసముద్రం: సకల గణాలకు అధినాయకుడైన వినాయకుడిని చవితి సందర్భంగా పూజిస్తే సకల విఘ్నాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ప్రతిఏటా వినాయక చవితికి భారీగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు చవితి పందిళ్లలో ఏర్పాటు చేసి పూజించడం ఆనవాయితీగా మారింది. పీఓపీ విగ్రహాలను వినియోగిస్తే పర్యావరణానికి, తద్వారా మానవాళికి చేటు అని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. మరోవైపు పంచభూతాల్లో ఒకటైన మట్టితో తయారు చేసిన స్వామి విగ్రహాలను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని వేదపండితులు చెబుతున్నారు. హానికర రసాయనాలలో రూపొందే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు ఏమాత్రం సమ్మతం కాదంటున్నారు. ఈ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారీకి, గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పలుచోట్ల ఇతర రాష్ట్రాల నుంచి కళాకారులు ప్రతి ఏటా ఇక్కడికి చేరుకుని విగ్రహాలను రూపొందించి విక్రయిస్తుంటారు. చవితికి నెల రోజులముందే విగ్రహాలను ఎంపిక చేసి అడ్వాన్స్ ఇచ్చేస్తారు.



బంకమట్టితో చేసిన విగ్రహాలు

ఈనేపథ్యంలో భారీగా వినాయక విగ్రహాలు సిద్ధం చేశారు.

మట్టి ప్రతిమలే మేలు..

చెరువు, కాలువల్లో దొరికే బంకమట్టితో గణపతి ప్రతిమలు రూపొందించి ఆ విగ్రహాలను పూజల అనంతరం నీటిలో నిమజ్జనం చేయాలి. ఈ మట్టి విగ్రహాలు కాలువలు, వాగుల్లో నిమజ్జనం చేయడం వలన సులభంగా ప్రతిమ నీటిలో కరిగిపోవడంతోపాటు బంకమట్టి వలన నీటికి ఔషధ గుణాలు కలుపుతాయని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

పీఓపీతో ఎన్ని అనర్థాలో..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు విషతుల్యమైన అనేక రంగులు వేస్తున్నారు. వీటిలో లెడ్, క్యాడ్మియం, కాపర్ క్రోమియం, మెర్క్యురీ వంటి హానికరమైన రసాయనాలు ఉంటాయి. ఆ పదార్థాలు నీటిలో కరగకపోగా వాటి నుంచి వెలువడే విషతుల్యాలు నీటిలో పేరుకుపోతాయి. రంగులు నీటిని కలుషితం చేస్తున్నాయి. రసాయనాలు కలిసిన నీరు జలచరాల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ నీటిలో పెరిగిన చేపల వంటి వాటిని తినడం వలన కేన్సర్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన ఉన్నా..

మట్టి విగ్రహాలనే పందిళ్లలో ఏర్పాటు చేసి పూజించాలని కొన్ని ఏళ్లుగా స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు భక్తులకు సూచిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఉపయోగించడం వలన కలిగే అనర్థాలను వివరించడంలో సంబంధిత అధికారులు స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న ప్రజల్లో మార్పు మాత్రం రావడంలేదు. అధికారులు మట్టి విగ్రహాలనే పూజించాలని అవగాహన కల్పించాలి

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



పీఓపీ విగ్రహాల కన్నా మట్టి విగ్రహాలు శ్రేష్టం. రసాయనాలతో తయారు చేసే విగ్రహాలను చెరువుల్లో పడేయడం వలన ఆ నీటిని పశువులు తాగి వ్యాధులు బారిన పడతాయి. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు వాడడం మంచిది.

– శ్యామలమ్మ, ఎస్‌కేఆర్ పురం ఇన్‌చార్జ్ హెచ్ఎం

మట్టి విగ్రహాలు శుభప్రదం



మట్టివిగ్రహాలను పూజించడం శుభప్రదం. మట్టి పంచభూతాల్లో ఒకటి వినాయకుడు పృథ్వీమయం. అందుకే భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారు చేసి పూజించాలి. మట్టితో తయారు చేసిన విగ్రహాలు నిమజ్జనం చేయడం వలన అది వెంటనే నీటిలో కరిగిపోతుంది. – మహేష్ బాబు, సర్పంచ్

పర్యావరణానికి హాని ఉండదు



మట్టితో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎటువంటి హామీ జరగదు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వల్ల చర్మం సంబంధ వ్యాధులతో పాటు, శ్వాసకోశ, ఊరిపితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల మట్టి గణపయ్యలనే పూజిద్దాం.

– మోహన్‌క్రిష్ణ, వైద్యాధికారి

ఇసుక ట్రాక్టర్ సీజ్

శ్రీరంగరాజపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. గంగాధరనెల్లూరు మండలం ముక్కల్తూరు గ్రామం పరిధిలోని నీవానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌కు తహసీల్దార్ అమర్‌నాథ్ రూ.8 వేలు జరిమానా వేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుంటే 9440900692, 9491077028 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం: సోషల్ మీడియాతో యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ భారతి తెలిపారు. మంగళవారం వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చక్రధర రావ్ సమక్షంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ భారతి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆడపిల్లల తమ జీవితాన్ని తామే నిర్మించుకోవాలని సూచించారు. వాట్సాప్‌లు, ఇతర మాధ్యమాల్లో ప్రొఫైల్ పిక్చర్, స్టేటస్‌లో ఫొటోస్ పెట్టుకోవడం వల్ల వచ్చే సమస్యలను వివరించారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కార్వేటినగరం: క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసం, ఉత్సాహం పెంచేందుకు ఎంతో దోహదపడతాయని డీఎంపురం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సరస్వతి అన్నారు. 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వివిధ క్రీడలను నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒత్తిళ్లను అధిగమించి మానసికోల్లాసాన్ని పొందగలరని అన్నారు. డీఎంపురం విద్యార్థులను జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్ది ప్రతి సంవత్సరం అవార్డులను అందుకునేలా కృషిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలరాజును అభినందించారు.ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జాతీయ క్రీడా దినోత్సవం రోజు బహుమతులను అందజేస్తామన్నారు. కమిటీ చైర్మన్ త్యాగరాజు, ఉపాధ్యాయులు హరిత, మాలతి, సుమతి, సుబ్రమణ్యంరెడ్డి, చిన్నయ్యశెట్టి, వెంకటరమణయ్య, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతను తప్పించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతను టీచర్లకు తప్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై అసోసియేషన్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన డీఈఓ ఆ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ముఖ్యంగా మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత నుంచి తొలగించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆ బాధ్యతలను తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, అయితే మళ్లీ టీచర్లతోనే ఫొటోలు తీయిస్తున్నారని నిరసించారు. ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది చేత ఫొటోలు తీయించే పనులు చేయించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారని, రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి అరగంట వ్యవధిలో పది అంశాలతో కూడిన గూగూల్ ఫామ్ పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఎస్ఎంసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది ఫొటోలు తీయకపోతే ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని ఉన్నతాధికారులు హుకుం జారీచేస్తున్నారని ఆరోపించారు. మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత తగ్గిందని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని మోపుతూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇచ్చిన బాధ్యతలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మణిగండన్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, ఎస్పీ బాషా, పార్థసారథి, గణేష్ కుమార్, సాధన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 104 వైద్యసేవలు



గుడిపాల: వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని గుడిపాల,బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు సంధ్య, రష్మిత తెలిపారు. మంగళవారం వెప్పాలమానుచేను, కుప్పిగానిపల్లెలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ వైద్యపరీక్షలను నిర్వహించారు. మంచం పట్టిన రోగుల ఇళ్లకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, రుక్మిణి, కవిత, శిల్ప, దివ్య, శివగామి, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

వేదగిరివారిపల్లెలో..

ఐరాల: గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల ఉద్యోగుల నిరసన

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియకు పూనుకోవాలని ఏపీసీటీఎస్ఏ డివిజన్ అధ్యక్షుడు పూర్ణం డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం స్థానిక వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగిన అక్రమాలు, రాష్ట్ర ఉన్నతాధికారుల అవినీతిపై దర్యాప్తు చేయాలన్నారు. ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలన్నారు. అధికారాల కేంద్రీకరణను మార్పు చేయాలన్నారు. జీఎస్టీఓలకు చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ రద్దు చేయాలని, ఉద్యోగుల బదిలీల పై శాశ్వత విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. సర్కిల్స్ వ్యవస్థను బలహీనపరిచే చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు. డిమాండ్లు నెరవేరే వరకు రోజూ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, యోగేంద్రనాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి



గోమాతకు పశుగ్రాసం పెడుతున్న ఈఓ, అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన గోశాలలో మంగళవారం గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ప్రధాన ఆలయం నుంచి ఆలయ ఈఓ కె.వాణి, ఆలయ అధికారులు, ఉభయదారులు పూజాసామగ్రిని మేళతాళాలతో ఊరేగింపుగా గోశాలకు తీసుకెళ్లారు. గోశాల వద్ద ఏర్పాటు చేసిన కామధేనువు చిత్రపటానికి, గోవులకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవులకు పశుగ్రాసం పెట్టారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ, పర్యవేక్షకులు శ్రీధర్‌బాబు, మల్లికార్జున, ఉభయదారులు పాల్గొన్నారు.

ఉట్లోత్సాహం

గోకులాష్టమి పురస్కరించుకుని గోశాల వద్ద ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత ఈఓ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే చిన్నపిల్లలు రాధాకృష్ణుల వేషధారణలో భక్తులను ఆకట్టుకున్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గంగాధర నెల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ పరిస్థితులు బాగాలేక చదువు మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ దిక్సూచి అని ఎంఈఓలు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేవారు. చదువుకోవడం వలన ఉపయోగాలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేటి తరం గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పరిస్థితుల్లో చదువుకు దూరం అవుతున్నారని అలాంటి వారి కోసం ఓపెన్ స్కూల్‌లో చేరి వారి కల నెరవేర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ విద్యను చదివి ఉద్యోగాలు సాధించవచ్చునని సూచించారు. హెచ్ఎం ఈ.హేమలత, ఓపెన్ స్కూల్ సహాయ నిర్వాహకులు పి. దినకరన్, ఉపాధ్యాయులు ఎస్. శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందజేస్తున్న సభ్యులు

గంగాధర నెల్లూరు: తూగుండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమృత భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఎల్ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, విలువలు కాపాడుకోవడానికి విద్యార్థి దశ నుంచే కృషిచేయాలని పిలుపునిచ్చారు. శతావధాని ఆముదాల మురళీ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యం, తెలుగు పద్యాలు అంశాలపై మాట్లాడారు. విద్యార్థులు పద్యాలను కంఠస్థం చేయాలని కోరారు. హెచ్ఎం రాజేంద్ర నాయుడు, విద్యాకమిటీ చైర్మన్ కాణిపాకం సుధాకర్, పూర్వ విద్యార్థి ఆముదాల పద్మనాభం, ఫౌండేషన్ కో ఆర్డినేటర్ లోకేష్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్‌లు, జామెంటరీ బాక్స్‌లు, స్వామి వివేకానంద జీవిత చరిత్ర, శతమధురిమలు అనే పుస్తకాలు పంపిణీ చేశారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం



దాత అందించిన కంప్యూటర్లు

కార్వేటినగరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.స్వరూప అన్నారు. మంగళవారం వి.కోటకు చెందిన అమ్మాక్ట్ సహకార సేవా సంస్థ సీఈఓ దశరథరెడ్డి రూ.2.50 లక్షల విలువచేసే 10 కంప్యూటర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి పట్ల అభిమానం కలిగిన దాతలు ఉండడం పేద విద్యార్థులకు వరమన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దాత దశరథరెడ్డి

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కేసులు



దుకాణదారునితో మాట్లాడుతున్న అధికారులు

- జిల్లా సహాయ బాలల రక్షణాధికారి జగదీశ్వర్

బంగారుపాళెం: దుకాణాల నిర్వాహకులు చదువుకునే పిల్లలను పనుల్లోకి పెట్టుకుంటే కేసులు తప్పవని జిల్లా సహాయ బాలల రక్షణాధికారి జగదీశ్వర్ హెచ్చరించారు. మంగళవారం బంగారుపాళెం, తగ్గువారిపల్లె గ్రామాల్లో జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ, 14 ఏళ్ల లోపు ఉన్న పిల్లల దుకాణాలలో పనులకు పెట్టుకోవడం బాల కార్మిక చట్టం1986 ప్రకారం నేరమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుకునేందుకు బడులకు పంపాలన్నారు. చదువుకునే వయస్సులో వారిని ఇతర పనులకు పంపి వారిని మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేయడం ఎంతమాత్రమూ సరికాదన్నారు. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వళ్లెమ్మ, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలల పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.